క్లుప్తంగా

నేడు ఉపాధ్యాయులకు సమావేశం

కెరమెరి: మండలంలోని కేస్లాగూడ రైతు వేదికలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సమగ్ర కుటుంబ సర్వేపై 'సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1:30 గంటలకు జరిగే సమావేశానికి ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

6న పద్మశాలీ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆసిఫాబాద్: పట్టణ పద్మశాలి సేవ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 6న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు అనుమాండ్ల శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పద్మశాలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసమే ఫోన్‌ఇన్


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపడుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టారు. వివిధ మండలాల నుంచి భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, నీటి, మురికి కాలువలు, ఫారెస్ట్, పెన్షన్ తదితర సమస్యలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఖానాపూర్‌ను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పరామర్శ

ఐటీడీఏ వసతి గృహంలో దినసరి కూలీగా విధులు నిర్వహిస్తున్న సెడ్మకి రాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కుటుంబాన్ని పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

బిర్లగొంది శివారులో పులి సంచారం!

బోథ్: మండలంలోని బిర్లాగొంది గ్రామ శివారులో శుక్రవారం పెద్దపులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన అంబాజీ అనే రైతు తన చేనుకు రాత్రి 7 గంటల ప్రాంతంలో వెళ్లగా పెద్దపులి సంచరిస్తూ కనిపించిందన్నారు. వెంటనే ఆయన పరిగెత్తి గ్రామానికి వచ్చారు. పెద్దపులి సంచరిస్తుందని గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు టార్చ్‌లైట్లతో తమ గ్రామానికి వెనక భాగంలో వెతికారు. కాగా అరుపులు వినబడటంతో వారు వెనక్కి వచ్చినట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఉట్నూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు ఆహ్వానం అందజేశారు. ఈనెల 12 నుంచి 16 వరకు ఆలయ 40వ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేశ్, నాయకులు టి.లక్ష్మణ్, ఎల్.రాములు, సుధాకర్, తోట సత్యం, రాం భీమన్న, ఎల్.లక్ష్మణ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణకు ఆహ్వానం

ఖానాపూర్: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు విగ్రహావిష్కరణకు హాజరు కావాలని కోరుతూ సంఘం సభ్యులు మాజీ మంత్రి జోగు రామన్నకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 10న ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో విగ్రహావిష్కరణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ రాజన్న, బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, సిరిపురం నాగరాజు, మడిగెల గంగాధర్, కొక్కుల ప్రదీప్, కడుకుంట్ల రవి తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడెం: మండలంలోని సారంగపూర్‌కు చెందిన కుమ్మరి వంశీకృష్ణకు రూ.13 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి సుధాకర్, కోల శ్రీనివాస్, మార్కపు లక్ష్మణ్, కుమ్మరి భూమన్న, ఆనందం, భీమలింగు, రాజన్న, కొండయ్య తదితరులున్నారు.

ప్రాణాలు పోతున్నాయ్..!


తాటిపల్లి వద్ద నదిలో ఈత కొడుతున్న యువత (ఫైల్)

- నరదాల పేరిట ప్రాణాల మీదకు..
- నదుల్లో తరుచూ ప్రమాదాలు
- కానరాని రక్షణ చర్యలు

కౌటాల: జిల్లా చుట్టూ ఉన్న జీవనదుల్లో నిత్యం నీటి ప్రవాహం ఉంటుంది. ప్రధాన నది ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగా, పెద్దవాగు నదుల్లో యువత సరదా కోసం, ప్రజలు పుణ్యస్నానాలకు వెళ్తుంటారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. నదులు, వాగుల వద్ద తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. కనీసం పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. ఏటా అనేక ఘటనలు జరుగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. జిల్లాకు ప్రాణాధారమైన జీవ నదులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), బెజ్జూర్ మండలాల్లోని పెన్‌గంగ, ప్రాణహిత, వార్ధా నదుల వద్ద పడవ ప్రయాణం, సాన్నాలకు వెళ్లిన యువత ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోవడం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది.

సరదా.. విషాదం

సరదా.. సంతోషం ఏదైనా శృతి మించకూడదు. వేడుకల పేరిట యువత తీరు ప్రమాదాలకు కారణం అవుతుంది. ఒకప్పుడు వేడుకలంటే కుటుంబమంతా కలిసి ఒక్కచోట చేరి సరదాగా గడిపేవారు. కానీ ప్రస్తుతం వేడుక అంటే యువత మాత్రమే జరుపుకునేదిగా మారిపోయింది. మద్యం, మాంసంతో విందులు చేసుకోవడం పరిపాటిగా మారింది. సరదా కోసం బెజ్జూర్‌లో ముగ్గురు యువకులు నదిలో స్నానానికి వెళ్లి మృత్యువాత పడడం చర్చనీయాశంగా మారింది. ఈ ఘటనతో యువతతో పాటు తల్లిదండ్రులు సైతం గుణపాఠం నేర్చుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

కానరాని చర్యలు..

జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది మొదలై.. చింతలమానెపల్లి మండలం రణవెల్లి, భూరెపల్లి, కోర్సిని, దిందా, చిత్తాం, గూడెం, బూరుగూడ, బెజ్జూర్ మండలం సోమిని, తలాయి, పెంచికల్‌పేట్ మండలంలోని ముర్లిగూడ, దహెగాం మండలం మొట్లగూడ, రాంపూర్ గ్రామాల మీదుగా ప్రవహిస్తోంది. పెన్‌గంగా నది సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, టోంకిని, వెంకట్రావుపేట, లోనవెల్లి, కౌటాల మండలంలోని వీరవెల్లి, తాటిపల్లి, వీర్దండి, గుండాయిపేట వరకు ప్రవహిస్తుంది. సమీప గ్రామాల్లోని ప్రజలు నిత్యం ఇక్కడికి సాన్నాల కోసం వస్తుంటారు. ఈ నదుల్లో మహారాష్ట్రకు నాటు పడవల్లో ప్రయాణించే వారికి ఆపత్కాలంలో ప్రమాదం సంభవిస్తే ప్రాణాలతో బయటపడటం దేవుని దయగా మారింది. నది ఒడ్డున గాలి నింపిన ట్యూబ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉండగా అవేవీ కానరావడం లేదు. స్నానాలకు అనువైన ప్రదేశాలను గుర్తించి నీటి మట్టం, ఎక్కువగా ఉండి ప్రమాదకరంగా ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

జరిగిన ఘటనలు..

- ఈనెల 1న చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద ప్రాణహిత నదిలో మహారాష్ట్రలోని అహేరికి చెందిన తేజస్‌రాజ్ బొమ్మవార్ అనే యువకుడు గల్లంతయ్యాడు. నదిలో నీటి మట్టంపై అంచనా లేకపోవడంతో స్నానం చేసేందుకు నదిలోకి దిగిన కాసేపటికే తేజస్ మునిగిపోయాడు.
- కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద గత 2016న మే 23న ప్రాణహిత నదిలో నాటు పడవలో వస్తున్న మంచిర్యాల జిల్లాకు చెందిన బోరే వెంకటేశ్, మమత, రాజు పడవ ప్రమాదంలో మృతి చెందారు.
- కౌటాల మండలం వీరవెల్లి వద్ద 12 ఏళ్ల క్రితం పడవలో పెన్‌గంగ నది దాటుతూ నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందారు.
- చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద మూడు సంవత్సరాల క్రితం ప్రాణహిత నదిలో పడవలో వెళ్తున్న ఇద్దరు బీట్ అధికారులు నీట మునిగి మృతి చెందారు.

నదుల్లోకి స్నానాలకు వెళ్లొద్దు..



సరదాలు, సంతోషాల పేరిట యువత ప్రమాదాలకు గురికావద్దు. సరదా కోసం నదుల్లో స్నానాలకు వెళ్లవద్దు. నదిలో నీటి లోతుపై అంచనా లేకుండా యువత గల్లంతవుతున్నారు. యువత బాధ్యతగా ఉండాలి. వేడుకల పేరుతో ప్రమాదాల బారిన పడొద్దు. పిల్లలపై తప్పనిసరిగా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి.

రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్

వైభవంగా బులాయి వేడుకలు


బులాయి ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలోని రాజుర, మోతుగూడ గ్రామంలో బులాయ్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు సంప్రదాయ బద్ధంగా మట్టిని తెచ్చి బులాయ్, బొండోబా మట్టి ప్రతిమలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు ఆదివారం ప్రతిమలను బతుకమ్మ తరహాలో మధ్యలో ఉంచి యువతులు, మహిళలు ఆడిపాడి ఉదయం గ్రామంలోని పెద్ద వాగులో నిమజ్జనం చేశారు.

మహార్ కులస్తులు ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: మహార్ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని బుద్ధ సమాజ్ సంఘం మండలాధ్యక్షుడు పి. బండురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బుద్ధవిహార్‌లో బౌద్ధ సమాజ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 నుంచి చేపట్టే కుల గణనలో మహార్ కులస్తులు మహార్ కులంగా రాయించాలని తెలిపారు. బౌద్ధ మతస్తులు బౌద్ధ మతంగా సర్వేలో రాయించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న కులగణనకు అందరు సహకరించాలన్నారు. మహార్ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బసర్కార్ విశ్వనాథ్, దుర్గం మోతిరాం, సురేశ్, వెంకటేశ్, ఏమాజీ, గోవింద్ రావు, పత్రు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ కస్తూరి బా విద్యాలయంలో బోధనేతర సిబ్బంది భర్తీ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న వంట మనిషి, సహాయ వంటమనిషితో పాటు నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. తప్పనిసరిగా రె బ్బెన మండలానికి చెందిన వారై ఉండాలని, 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. సహాయ వంటమనిషి పోస్టును ఏడో తరగతి మార్కుల మెరిట్ ఆ ధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కనకదుర్గ ఆలయంలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్ కనకదుర్గా దేవీ, స్వయంభూ మహాంకాళీ అమ్మవారి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఓడి బియ్యం, నైవేద్యాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని శనేశ్వరుడు, శివలింగంతో పాటు కాలభైరవుడు, నాగదేవత విగ్రహాలను దర్శించుకున్నారు. అర్చకులు వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా డీవైఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం


నినాదాలు చేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని రాంపూర్, రాళ్లపేట గ్రామాల్లో ఆదివారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, మండల కార్యదర్శి ఆత్మకూరి సతీష్‌లు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ పోరాటం, త్యాగం, అభివృద్ధి అనే నినాదంతో పోరాటాలు చేస్తోందన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ప్రభుత్వాలతో పోరాటాలు సాగిస్తూనే ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం పేరుతో యువతను మత్తులో ముంచి యువతకు ఇచ్చిన హామీలను మర్చిపోయిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగంలో ఎన్నో ఖాళీలు ఉన్నా.. వాటిని భర్తీ చేయకపోవటంతో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ప్రభుత్వరంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి శ్రావణి, మండల ఉపాధ్యక్షుడు చల్లూరి క్రిష్ణ, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కలగానే సాంకేతిక విద్య..!

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇటీవల కాలంలో ఉపాధ్యాయులను భర్తీ చేయడంతో పాటు ప్రతీ మండలానికి ఒక్కో ఇన్‌చార్జి ఎంఈవోను నియమించింది. కానీ ఏళ్లగా ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లను ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి.

- నిరుపయోగంగా కంప్యూటర్లు
- కంప్యూటర్ విద్యకు విద్యార్థులు దూరం
- పట్టించుకోని అధికారులు


సుర్దాపూర్ పాఠశాలలోని కంప్యూటర్లు


కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కెరమెరి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కంప్యూటర్ విద్య బోధన అందని ద్రాక్షగా మారింది. మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గతంలో మంజూరు చేసిన కంప్యూటర్లు తుప్పుపట్టి పోతున్నాయి. పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను బోధించే వారు లేకపోవడంతో కంప్యూటర్ విద్య అందకుండా పోతుంది. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో అన్ని విధాల బోధన సౌకర్యం కల్పించాలన్నా.. ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాల్లో కంప్యూటర్ విద్యను ప్రవేశపెట్టింది. ఇందుకు రూ. లక్షలు వెచ్చించి కంప్యూటర్లు మంజూరు చేసింది. వాటికి కావాల్సిన సామగ్రిని కూడా అందించింది. కానీ అమలు చేయడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది.

అలంకారంగా కంప్యూటర్లు..

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల కెరమెరి, ప్రాథమికోన్నత పాఠశాల సుర్దాపూర్, ఝరిలో మంజూరు చేసిన కంప్యూటర్లు అలంకార ప్రాయంగా మారాయి. దీంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. మండల కేంద్రంలో మంజూరైన ఏడాది మాత్రమే ఇవి పని చేయగా మిగతా పాఠశాలల్లో మంజూరైనప్పటి నుంచి నిరుపయోగంగానే మారాయి. ఒక్క రోజు కూడా పని చేసిన దాఖలాలు లేవు.

అమలులో నిర్లక్ష్యం..

పాఠశాలల్లో కంప్యూటర్లను మంజూరు చేయడమే తమ వంతు అనుకున్న అధికారులు బోధించే వారిని నియమించలేదు. ఉపాధ్యాయుల్లో కూడా వీటి పట్ల అంతగా అవగాహన లేక పోవడంతో అవి మంజూరైనప్పటి నుంచి నిరుపయోగంగా మారాయి. ఒక్కో పాఠశాలలో 5 నుంచి 10 కంప్యూటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిని ఉపయోగంలోకి తేవాలన్నా.. చిత్తశుద్ధి లేక పోవడంతో ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేద్దామన్నా ఆశయం నీరుగారి పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు పూర్తి స్థాయిలో కంప్యూటర్ విద్యను అందించేందుకు కృషి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

కంప్యూటర్ విద్య ఎంతో అవసరం



కంప్యూటర్ విద్య బోధకులు లేకపోవడంతో పలు పాఠశాలల్లోని కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య చాలా అవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–ఆడే ప్రకాశ్, ఎంఈవో కెరమెరి

భక్తిశ్రద్ధలతో ఆదివాసీల పూజలు


డప్పులతో బయలుదేరుతున్న ఆదివాసీలు


భేటింగ్ అవుతున్న మహిళలు

గడిచిన వారం రోజులుగా కొనసాగిన దండారీ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. సాకడ(ఏ) గ్రామంలో కొలబోడి పేరిట నిర్వహించిన ఉత్సవాన్ని ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏత్మాపూర్‌కు ప్రజలు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. కోడల్ నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. గుస్సాడీలు దప్పుచప్పుళ్ల మధ్య ఇప్ప చెట్టు వద్దకు వెళ్లి నెమలి టోపీలతో పాటు వివిధ రకాల ఆభరణాలను చెట్టు వద్ద భద్రపరిచారు. అనంతరం గోదావరి నదిలో స్నానం చేశారు. నవధాన్యాలు, కోడి పుంజుతో పూజలు చేసి, అక్కడే వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. - కెరమెరి


సామూహిక పూజలు చేస్తున్న ఆదివాసీలు


చూడముచ్చటగా కోడల్ నృత్యం


ఇప్పచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బాధితులకు చేయూత


సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండలంలోని మోతీపటార్ గ్రామంలోని ఇటీవల కేన్సర్‌తో బానోత్ సునీత మృతిచెందింది. విషయం తెలుసుకున్న దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీన్ నాయక్ సహకారంతో కుటుంబసభ్యులకు ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పవార్ పితా నాయక్, రాథోడ్ రాహుల్, జాదవ్ గజానంద్, తదితరులు పాల్గొన్నారు.